ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
ఆదివారం 27 అక్టోబరు 2024





ఉపరాష్ట్రపతి దంపతులకు జ్ఞాపిక అందజేత



కలబురగిలో తయారైన కడక్ రొట్టె

ఆన్‌లైన్‌లో కలబురగి రొట్టె



- ప్రముఖ షాపింగ్ యాప్‌ల్లో లభ్యం
- నవంబరు 6 నుంచి ప్రారంభం
- ఐటీబీటీ మంత్రి ప్రియాంక ఖర్గే
- ఉత్పత్తిదారుల సహకార సంఘం ఏర్పాటు..
- ప్రత్యేక క్యూఆర్ కోడ్
- నెల రోజుల పాటు నిల్వ ఉండేలా చర్యలు

బెంగళూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాంతాలవారీగా ఆహారపద్ధతులు భిన్నంగా ఉన్నాయి. బెంగళూరుతోపాటు మైసూరు ప్రాంతంలో రాగిముద్ద, వరి అన్నం ఆహారంగా తీసుకోవడం ఆనవాయితీ. అయితే ఉత్తర కర్ణాటక పరిధిలోని దాదాపు పది జిల్లాల్లో జొన్నరొట్టె ప్రధాన ఆహారంగా ఉంది. దశాబ్దాల కాలంగా వారి ఆహారం జొన్నరొట్టె. అందుకే ఉత్తర కర్ణాటక ప్రాంతంలో జొన్న సాగు కూడా అత్యధికంగా ఉంటుంది. కడక్ రొట్టె మాకు ఇష్టమని ఉత్తర కర్ణాటక జిల్లాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తుంటారు. ఖడక్ రొట్టెను ఇష్టపడేవారికి నిజంగా ఇది సంతోషకరమైన వార్తగా చెప్పవచ్చు. జీఐ గుర్తింపు పొందిన కలబురగి కందిబేడలకు ఆన్‌లైన్‌లో మార్కెట్ కల్పించిన తరహాలోనే కలబురగి ఖడక్ రొట్టె ఇకపై ప్రతిచోటా లభించనుంది. జొన్నరొట్టె ఉత్తర కర్ణాటకలో ప్రధాన ఆహారం కాగా చిత్తాపుర, మాల్దండి జొన్నరొట్టె అత్యంత ప్రాచుర్యం కలిగి ఉంది. ఈ రొట్టెకు ప్రస్తుతం ఆన్‌లైన్ మార్కెట్ సౌలభ్యం దక్కింది. ఇప్పటికే క్యూఆర్ కోడ్ కూడా వచ్చేసింది. స్కాన్ చేస్తే జొన్న రొట్టె, సజ్జరొట్టెతోపాటు పలురొట్టెలు వాటిలో వినియోగదారులు అవసరమైనవి ఎంపిక చేసుకోవచ్చు. వాటిని నేరుగా ఇళ్లకే సరఫరా చేసే విధానం వచ్చింది. ప్రారంభంలో ఒక ఆర్డర్‌కు పది రొట్టెలు తప్పనిసరి చేశారు. రొట్టెలు పార్సిల్స్ చేసినా ఎక్కడా నాణ్యతలో మార్పు రాకుండా ఉండేలా మైసూరు భారతీయ ఆహార పరిశోధనా కేంద్రం ద్వారా ప్రత్యేక ప్యాకింగ్ విధానం అమలు చేశారు. తద్వారా పార్సిల్స్ పంపినా రొట్టె నాణ్యతలో మార్పు లేకుండా చేతికి అందనుంది. ఆన్‌లైన్‌లో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలతో ఒప్పందం చేసుకున్నారు. ఖడక్ జొన్నరొట్టెలను నెలల తరబడి నిల్వ చేసుకునేందుకు కూడా అవకాశం ఉంటుంది.

జొన్న రొట్టెకు మార్కెట్ కల్పించడమే ధ్యేయం

రాగి ఉత్పత్తులకంటే జొన్నతో తయారు చేసే ఆహార పదార్థాల్లో పౌష్టికాంశాలు అధికంగా ఉంటాయని శక్తివంతమైనవనేది అందరి అభిప్రాయం. జొన్నరొట్టెలో గ్లూకోజ్, బీకాంప్లెక్స్ ఉండగా సజ్జరొట్టెలో ఐరన్ అంశాలు ఎక్కువగా ఉంటాయి. పౌష్టికాంశాలు అత్యధికంగా ఉండే ఆహారమిది. కలబురగి రొట్టె పేరుతోనే బ్రాండింగ్ చేయదలిచారు. ఇప్పటికే రొట్టె ఉత్పత్తుల సహకార సంఘం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో 20మంది సభ్యులు ఉన్నారు. ఖడక్ రొట్టె తయారు చేసేందుకు జిల్లా యంత్రాంగం వంద యంత్రాలను పంపిణీ చేశారు. గంటకు 200 నుంచి 800 దాకా రొట్టెలు తయారు కానున్నాయి.



రైతుకు దక్కనున్న గిట్టుబాటు ధర

జొన్నరొట్టెకు తగిన మార్కెటింగ్‌తో పాటు సాగు రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలనేది ప్రధాన ఆశయం. రొట్టె తయారు చేసే మహిళలకు ఆర్థికంగా శక్తిని పెంపొందింపచేయడం, బ్రాండింగ్ చేయడం ద్వారా డిమాండ్ కూడా పెంచదలిచారు. జొన్న సాగు చేసే రైతులకు గిట్టుబాటు కల్పించనుంది. స్థానిక ఆహారానికి అంతర్జాతీయ గుర్తింపు రానుంది. రొట్టెల పరిశ్రమ విస్తృతమయ్యేందుకు ఇది సహకరించనుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాలు అంతర్జాతీయ స్థాయిలో రొట్టెను ఇష్టపడేవారికి దేశీయ ఆహారం లభించే అవకాశం కలగనుంది.

- ఐటీబీటీ, కలబురగి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రియాంక ఖర్గే ఆసక్తితో డిజిటల్ అనుసంధానం చేశారు. నవంబరు 6న దీనిని లాంఛనంగా ఆరంభించనున్నారు. ప్రస్తుతం ఒక రొట్టె రూ.5 కాగా రవాణా ఖర్చులు, జీఎస్టీతో కలిపి ఎక్కువ కానుందని కలబురగి జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ సమన్ పటేల్ తెలిపారు.

రొట్టెతో మధుమేహానికి చెక్

ఇటీవల మధుమేహ పీడితుల సంఖ్య పెరగడంతో జొన్న రొట్టెకు మరింత క్రేజ్ పెరిగిందని చెప్పవచ్చు. జొన్న, సజ్జలతో తయారయ్యే ఆహార పదార్థాలు పౌష్టికాంశాలు అధికంగా ఉంటాయి. స్థూలకాయం, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, వాపులతోపాటు కేన్సర్‌తోపాటు పలు జబ్బులనుంచి రోగనిరోధకశక్తికి అవసరమైన పౌష్టికాంశాలు ఉంటాయి. సిరిధాన్యాల్లో జొన్న అగ్రస్థానంలో ఉంది. ఏ వయస్సువారైనా జొన్నలతో తయారు చేసిన ఆహార పదార్థాలు తీసుకోవచ్చు. ప్రొటీన్, ఫైబర్, అవసరమైనంత ఖనిజలవణాలు, విటమిన్‌లు పుష్కలంగా ఉంటాయి.

రొట్టెకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించేందుకు ఆన్‌లైన్ మార్కెటింగ్ ప్రారంభించామని కలబురగి జిల్లా అధికారి ఫౌజియా తరన్నుమ్ తెలిపారు. రొట్టె తయారు చేసే మహిళలకు జొన్నలు పండించే రైతులకు అనుకూలం కానుందన్నారు. రొట్టెల పరిశ్రమ విస్తృతం చేసేందుకు కట్టుబడ్డామన్నారు. ప్రజలు కూడా వీటిని ఆదరించి తయారీదారులకు మేలు చేయాలన్నారు.

సనాతనం అంటే సానుభూతి, కరుణ, సహనం

- శృంగేరి పీఠాధిపతి సువర్ణభారతి మహోత్సవంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్

బెంగళూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సనాతనం అంటే సానుభూతి, కరుణ, సహనం, అహింస, ధర్మం అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ అన్నారు. శృంగేరి పీఠాధిపతి సువర్ణభారతి మహోత్సవంలో భాగంగా నగరంలోని ప్యాలెస్ మైదానంలో శనివారం ఓం నమఃశివాయ పారాయణ పేరిట ప్రత్యేక కార్యక్రమం జరిగింది. శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థ స్వామీజీ సన్యాసం స్వీకరించి 50 ఏళ్లు అయిన సందర్భంగా సువర్ణభారతి పేరిట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ మాట్లాడుతూ పవిత్రమంత్రాల యొక్క లయలు, స్వరాలు ప్రకంపనలు శక్తివంతమైన శక్తిని సృష్టిస్తాయన్నారు. మానసికశక్తి, పర్యావరణ సామరస్యాన్ని పెంపొందిస్తాయన్నారు. వేదాలలోని శ్లోకాలు, క్రమబద్ధమైన నిర్మాణం, సంక్లిష్టమైన పారాయణ నియమాలు ప్రాచీన పండితుల శాస్త్రీయ నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. రాతపూర్వకమైన రికార్డులు లేకుండా భద్రపరిచిన ఈ సంప్రదాయాన్ని తరతరాలకు మౌఖికంగా జ్ఞానాన్ని ప్రచారం చేయగల భారతీయ సంస్కృతి సామర్థ్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. కాగా భారతీయ సంస్కృతిని అణగదొక్కేందుకు, కళంకం తెచ్చేందుకు మతోన్మాద మనస్సులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయనేందుకు సంస్కృతియే నిదర్శనమన్నారు. భారతీయ సంస్కృతిని ఏకీకృతం, బలోపేతం చేయడంలో ఆదిశంకరాచార్య భాగస్వామ్యం ప్రముఖమైనదన్నారు. భారతీయ ఆధ్యాత్మికత, తత్వశాస్త్రం అనాదిగా సంప్రదాయాలను పునరుద్ధరించేందుకు ఆయనకు దేశం రుణపడి ఉంటుందని అభిప్రాయపడ్డారు. శృంగేరి పీఠం విదుశేఖర తీర్థస్వామిజీ పర్యవేక్షణలో నమఃశివాయ పారాయణ సాగింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు ప్రహ్లాద్‌జోషి, సోమణ్ణ, డీసీఎం డీకే శివకుమార్, కైవార ధర్మాధికారి ఎంఆర్ జయరాంతోపాటు పలువురు పాల్గొన్నారు.



ఉపరాష్ట్రపతితో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, డీసీఎం డీకే శివకుమార్



సీఎం సిద్ధరామయ్యతో అజ్జంపీర్ ఖాద్రి, మంత్రి జమీర్ తదితరులు

రాజీ కుదిరింది..!

- శిగ్గావి నుంచి పోటీకి అజ్జంపీర్ ఖాద్రి వెనకడుగు
- సీఎం బుజ్జగింపుతో నామినేషన్ ఉపసంహరించుకుంటానని ప్రకటన

బెంగళూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): హావేరి జిల్లా శిగ్గావి ఉప ఎన్నికల బరి నుంచి కాంగ్రెస్ రెబల్‌గా నామినేషన్ వేసిన అజ్జంపీర్ ఖాద్రి కొన్నిగంటల వ్యవధిలోనే వెనకడుగు వేశారు. శుక్రవారం అజ్జంపీర్ ఖాద్రి నామినేషన్ వేళ హైడ్రామా సాగిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అభ్యర్థి యాసిర్ అహ్మద్‌ఖాన్ పఠాన్ నామినేషన్‌లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ కారుపై అజ్జంపీర్ అనుచరులు రాళ్ల దాడి చేసిన విషయం తెలిసిందే. మరోవైపు నామినేషన్‌కు కేవలం 15 నిమిషాలు గడువు ఉన్నవేళ ద్విచక్రవాహనంలో కేంద్రానికి రహస్యంగా వచ్చి పరుగులు తీసి నామినేషన్ వేశారు. అయితే రాత్రికి రాత్రి రాజీ కుదిరింది. మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ నేరుగా అజ్జంపీర్‌తో చర్చలు జరిపారు. రాత్రికి రాత్రి శిగ్గావి నుంచి బెంగళూరుకు రప్పించుకున్నారు. శనివారం సీఎం సిద్దరామయ్యను అధికారిక నివాసంలో మంత్రి సమక్షంలో అజ్జంపీర్ కలిశారు. ఆ తర్వాత డీసీఎం డీకే శివకుమార్‌ను కలిశారు. నామినేషన్‌ను ఉపసంహరించుకుంటానని అభ్యర్థి తరుపున పనిచేస్తానని అజ్జంపీర్ తెలిపారు. మంత్రి జమీర్‌అహ్మద్ ఖాన్ చొరవతోనే ఉపసంహరణ సాధ్యమైందని పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

హెచ్‌ఎంటీ పరిధిలోని 5 ఎకరాల భూమి స్వాధీనం

- ఉద్యానవనం ఏర్పాటుకు అటవీశాఖ చర్యలు
- మండిపడ్డ కేంద్రమంత్రి కుమార



హెచ్‌ఎంటీ కేంద్ర కార్యాలయం

బెంగళూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఒకప్పటి ప్రముఖ వాచీ తయారీ సంస్థ హెచ్‌ఎంటీ పరిధిలోని ఐదు ఎకరాల భూమిని రాష్ట్ర అటవీశాఖ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని పీణ్యా జాలహళ్ళి సర్వే నెంబరు 1లోని ఐదు ఎకరాల భూమిని అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సదరు భూమిలో ఉన్న కొన్ని ఆక్రమణలను తొలగించి పీణ్యా ప్లాంటేషన్ పేరిట బోర్డు ఏర్పాటు చేశారు. 1896, 1901 గెజిట్‌ల ప్రకారం సదరు భూమిని అటవీశాఖకు చెందినదిగా ప్రకటించారు. భూ పరివర్తన చేసుకోకుండా అటవీయేతర ఉద్దేశం కోసం ఈ భూమిని వినియోగించుకునేందుకు వీలు లేదని గతంలో అటవీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ లోకేటరీ అప్లికేషన్ సమర్పించారు. ప్రస్తుతం ఈ భూమి విలువ రూ.160 కోట్లదాకా ఉంటుంది. హెచ్‌ఎంటీ క్యాంపస్‌లో సద్వినియోగం చేసుకోని భూమిని స్వాధీనం చేసుకుని లాల్‌బాగ్, కబ్బన్‌పార్క్ తరహాలో ఉద్యానవనాన్ని ఏర్పాటు చేస్తామని అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె ప్రకటించారు. కాగా హెచ్‌ఎంటీ పరిధిలోని భూమిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకునేది లేదని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. కాగా ఏకంగా భూమి స్వాధీనంపై శనివారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ అనుబంధమైన హెచ్‌ఎంటీ నుంచి 5 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడం సరికాదన్నారు. అటవీశాఖమంత్రి ఈశ్వర్‌ఖండ్రె కోలారులో మొక్కలు నాటేందుకు వెళ్లారని అక్కడ ఓ మాజీ మంత్రి వందలాది ఎకరాల అటవీభూమిని లూటీ చేశారని దానిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఎన్ని ఎకరాల అటవీభూమి లూటీ అయ్యిందనేది గుర్తిస్తే బాగుంటుందన్నారు.

టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రారంభం

బెంగళూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు బెంగళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో శనివారం సభ్యత్వ నమోదును శ్రీకారం చుట్టారు. తెలుగు రాష్ట్రాల నుంచి బెంగళూరుకు ఉద్యోగ, వ్యాపారాల కోసం వచ్చి స్థిరపడిన వారంతా కలిసి బెంగళూరు టీడీపీ ఫోరం ద్వారా పుష్కర కాలంగా సేవలు అందిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల నాలుగైదేళ్ళుగా ఫోరం క్రియాశీలక రాజకీయ వ్యవహారాలలోను కీలకంగా పనిచేస్తోంది. రాయలసీమ పరిధిలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు ఫోరం విశేష కృషి చేసింది. ఇటీవల శాసనసభ ఎన్నికలలో ఫోరం సభ్యులు సొంతూళ్ళకు వెళ్ళి తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. బెంగళూరులో నివసించే తెలుగు వారందరికీ పార్టీ సభ్యత్వం కల్పించనున్నట్లు ఫోరం కన్వీనర్ కనకమేడల వీర, సోంపల్లి శ్రీకాంత్ తెలిపారు. శనివారం తెలుగురాష్ట్రాలలో ఆరంభమైన తెలుగుదేశం సభ్యత్వ నమోదును లాంఛనంగా ఆరంభించామని ఇక నిరంతరంగా ప్రత్యేకంగా కొనసాగిస్తామన్నారు. ఏపీ అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, జోరుగా సభ్యత్వ నమోదు చేయించుకుని తెలుగుదేశం పార్టీని బలపరచాలని వారు పిలుపునిచ్చారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మారతహళ్ళిలోని ఫోరం ఆఫీసులో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రవాసాంధ్రులు అందరూ సభ్యత్వ నమోదుకు కదిలి రావాలన్నారు. తొలిరోజున సభ్యత్వం పొందినవారిలో అధికంగా ఐటీ ఉద్యోగులున్నారు. ఫోరం ప్రతినిధులు శివ చనుమోలు, కోకా కేశవ్, విష్ణు, సురేష్, రాజు, వెంకట్ సహా పలువురు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేసుకున్న వారితో టీడీపీ ఫోరం ప్రతినిధులు

నేడు ఏపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఆత్మీయ సమావేశం

బెంగళూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖరం ఆత్మీయ సమావేశం ఆదివారం జరగనుంది. ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాలు, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రులందరిని బెంగళూరు తెలుగుదేశం ఫోరం ఆహ్వానించింది. కృష్ణ గుంటూరు జిల్లాలనుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఉభయ గోదావరి జిల్లాల అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంలు పాల్గొంటున్నారు. సంబంధిత జిల్లాల నుంచి వచ్చి బెంగళూరులో స్థిరపడిన పట్టభద్రుల మద్దతుకోసం ఆత్మీయ సమావేశం జరుపుతున్నారు. ఎమ్మెల్సీలు పరుచూరి అశోక్ బాబు, భూమిరెడ్డి రాంగోపాలరెడ్డి, కంచర్ల శ్రీకాంత్‌లు ముఖ్యులుగా పాల్గొంటున్నారు. మారతహళ్ళిలోని కృష్ణ సమ్మిట్‌లో ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ప్రకటనలో తెలిపారు.



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న క్యాప్సికం

‘పంట’ పండింది..

- అధిక దిగుబడి, ధరలతో క్యాప్సికం రైతు ఖుషీ

హోసూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): క్యాప్సిక రైతు ఖుషీ ఖుషీగా ఉన్నాడు. హోసూరు జిల్లాలో క్యాప్సికం సాగు అధికంగా చేస్తారు. ఈ ఏడు దిగుబడి బాగా ఉండడంతో పాటు మంచి ధరలు ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు. హోసూరు, బాగలూరు, కెలమంగలం, బైరమంగలం, డెంకణీకోటతోపాటుపలు ప్రాంతాల్లో క్యాప్సికం పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్లలో క్యాప్సికమ్‌కు డిమాండ్ పెరిగింది. మంచి ఆదరణ లభిస్తుండడంతో దళారులు నేరుగా హోసూరు రైతుల వద్దకు వచ్చి కొనుగోలు చేసి బెంగళూరు నుంచి విదేశాలకు సైతం విమానాల్లో తరలిస్తున్నారు. క్వింటాల్‌కు 6000 నుంచి 7000 దాకా పలుకుతున్నట్లు రైతులు అభిప్రాయపడుతున్నారు. విదేశాలలో డిమాండ్ ఉండడంతో నేరుగా ఎగుమతి చేయడం ప్రభుత్వం శిక్షణ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.



మైసూరు రోడ్డులో..

గొయ్యి కాదు దారి..

బెంగళూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొన్ని రహదారులు గోతులమయంగా మారింది. ప్రధాన రహదారులు సైతం పల్లె దారుల కంటే ఘోరంగా దర్శనమిస్తున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.



నాగరబావి రోడ్డులో..

జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ కార్యాలయం



ఇంకెప్పుడు ఇచ్చేది..?





పీఆర్‌లో వాహనాల అద్దె బిల్లుల పెండింగ్

జిల్లా వ్యాప్తంగా రూ.1.34 కోట్ల బకాయి

- రెండేళ్లుగా రూపాయి కూడా చెల్లించని ప్రభుత్వం
- 13 మంది డీఈఈలు, ముగ్గురు ఈఈలకు తప్పని తిప్పలు
- బిల్లుల రాక క్షేత్రస్థాయి పర్యటనలు అంతంతే..
- కూటమి ప్రభుత్వంలోనైనా చెల్లించేరా..?

అనంతపురం సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో వాహనాల అద్దె బకాయిలు కోట్లలో పేరుకుపోయాయి. గత రెండేళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో పలువురు డీఈఈలు, ఈఈల క్షేత్రస్థాయి పర్యటనలు అంతంత మాత్రంగానే సాగిన పరిస్థితి. తద్వారా అభివృద్ధి పనులు కూడా ఆశించిన స్థాయిలో జరగలేదు. కొందరు అధికారులు ఫీల్డ్‌కు వెళ్లకుండానే ఫోన్‌ల ద్వారానే పని కానిచ్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొందరైతే కాంట్రాక్టర్ల ద్వారా డిజిల్ వేయించుకుని వెళ్లినట్లు తెలిసింది. ఇంకొందరు నిత్యం కార్యాలయంలోనే కూర్చొని బిల్లులు పెట్టారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కూటమి ప్రభుత్వమైనా స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లిస్తే.. సదరు అధికారులు ఫీల్డ్‌కు వెళ్లి అభివృద్ధి పనులు వేగవంతం చేసే అవకాశం ఉందని ఆశాఖ వర్గాల్లో చర్చసాగుతోంది.

• రెండేళ్లుగా చెల్లించని బిల్లులు...

అభివృద్ధి పనులు పర్యవేక్షించడానికి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖలో పని చేస్తున్న ఈఈలు, డీఈఈలకు అప్పటి వైసీపీ ప్రభుత్వం అద్దె వాహనాలు సమకూర్చింది. అయితే వాటికి నెలవారి అద్దె బిల్లుల చెల్లించలేదు. వాస్తవంగా ఉపాధి హామీ పథకం ద్వారా శాఖకు అడ్మిన్ కింద 3 శాతం నిధులు కేంద్రం ఇస్తుంది. వీటి నుంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి అద్దెవాహనాలకు బిల్లులు చెల్లించేవారు. అయితే ఆ నిధులను వైసీపీ సర్కార్ ఇతర పథకాలకు మళ్లించి, వాహనాలకు బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందని ఆశాఖ వర్గాల సమాచారం.

జిల్లా వ్యాప్తంగా రూ.1.34 కోట్ల బకాయి

రాష్ట్ర వ్యాప్తంగా 2021 నవంబరు వరకు టీసీఎస్ సాఫ్ట్‌వేర్ కింద అధికారులకు ప్రతి మూడు నెలలకు అద్దె వాహనాల బిల్లులు ఎక్కడిక్కడ ఈఈ ల ద్వారా చెల్లించేవారు. అయితే కేంద్రం ఎస్ఐసీ సాఫ్ట్‌వేర్‌ను అమలు చేయడంతో ఆశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీల ద్వారా ఆశాఖ ఈఎన్‌సీకి వచ్చి ఆ తర్వాత ఈఈల ద్వారా బిల్లులు అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తరచూ బిల్లులు పెండింగ్‌లో పడ్డాయనే ఆరోపణలు ఉన్నాయి. అయితే కేంద్రం మాత్రం ఎప్పటికప్పుడు ఉపాధి హామీ అడ్మిన్ కింద ఇచ్చే 3 శాతం ఆశాఖ ఉన్నతాధికారులకు మంజూరు చేస్తోందని తెలిసింది. అక్కడే వైసీపీ సర్కార్ అసలు కథ నడిపిందని ఆశాఖ వర్గాల సమాచారం. ఉన్నతాధికారుల నుంచి ఈఈలకు రాకుండా నిధులను వైసీపీ సర్కార్ ఇతర పథకాలకు మళ్లించి రెండేళ్లుగా వాహనాలకు అద్దె బిల్లులు మంజూరు చేయకుండా మొండికేసిందని ఆశాఖ వర్గాల సమాచారం. ఈక్రమంలోనే జిల్లా వ్యాప్తంగా ఈఈలు, డీఈఈల అద్దె వాహనాల బిల్లులకు సంబంధించి రూ.1.34 కోట్లు పెండింగ్‌లో ఉంచినట్లు తెలిసింది. ఈ బకాయిలను ప్రస్తుత కూటమి కూటమి ప్రభుత్వమైనా చెల్లిస్తుందా..? లేక అలాగే పెండింగ్‌లో పెడుతుందా...? అనే సందేహం అధికారుల్లో వ్యక్తం అవుతోంది. పల్లె పండుగలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 100 కోట్ల గ్రామీణ రోడ్ల పనులను వేగవంతంగా చేయాలంటే అధికారులు ఫీల్డ్‌కు వెళ్లాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించి సకాలంలో వాహనాల అద్దె చెల్లించడంతో పాటు పెండింగ్ బకాయిలను త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇలా...

పీఆర్ విభాగంలో డీఈఈలు	: 07
క్వాసీ విభాగంలో డీఈఈలు	: 02
పీఐయూ డీఈఈలు విభాగంలో	: 04
పీఆర్‌ఐ ఈఈ	: 01
క్వాసీ ఈఈ	: 01
పీఐయూ ఈఈ	: 01
మొత్తం డీఈఈలు, ఈఈలు కలిపి	: 16 మంది
వాహనాల పెండింగ్ బిల్లులు	: 1.34 కోట్లు

పెండింగ్ వాస్తవమే




పంచాయతీ రాజ్‌శాఖలో అధికారులకు సంబంధించి అద్దె వాహనాల బిల్లుల పెండింగ్ ఉండటం వాస్తవమే. పీఆర్‌ఐ, క్వాసీ, పీఐయూ విభాగాల పరంగా ఒక్కోరకంగా పెండింగ్ ఉన్నాయి. ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే బిల్లులు వస్తాయని తెలిసింది.

- జహీర్ అస్లాం, ఎస్ఈ, జిల్లా పంచాయతీరాజ్‌శాఖ

దొరికినంత దోచెయ్..!

విడపనకల్లు సొసైటీలో తారస్థాయికి అవినీతి



విడపనకల్లు కో-ఆపరేటివ్ బ్యాంక్

4,863 ఎరువుల బస్తాలు పక్కదారి

రూ. 44.81లక్షలు స్వాహా

అవినీతి తేలినా చర్యలు శూన్యం

విడపనకల్లు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని విడపనకల్లు రైతు సేవా సహకార సంఘం (ఎఫ్ఎస్‌సీఎస్)లో అవినీతి తారస్థాయికి చేరింది. ఈ ఎఫ్ఎస్‌సీఎస్‌కు ఎవరు అధ్యక్షులు అయినా దోపిడీ మాత్రం ఆగటంలేదు. 2015 నుంచి ఇప్పటి వరకూ సొసైటీ ద్వారా వచ్చిన 4863 బ్యాగుల ఎరువులను పక్కదారి పట్టించారు. తద్వారా రూ. 44.81లక్షలు దోచుకున్నట్లు జిల్లా కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారి నిగ్గు తేల్చారు. ఈ డబ్బును రికవరీ చేయాలని ఆదేశించారు. మూడేళ్ల కిందట పాల్తూరు సొసైటీ గోడౌన్‌కు వచ్చిన దాదాపు 600బ్యాగుల ఎరువులు పక్కదారి పట్టాయని జిల్లా అధికారులు విచారణ జరిపి ఇద్దరు వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకున్నారు. 2018-19లో విడపనకల్లు గోడౌన్‌లో 1916 బస్తాల ఎరువులు లెక్కల్లో లేవు. 2021-22లో 2588 బస్తాల ఎరువులు లెక్కల్లో లేవు. పాల్తూరు గోడౌన్‌లో 2022-23లో 359 బస్తాల ఎరువులు కూడా అంతే. అక్రమాలు నిగ్గుతేల్చినా, పక్కదారి పట్టిన ఎరువులు, దానికి సంబంధించిన నగదును ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేదు. దీంతో సొసైటీలో ఎవరికి దొరికింది వారు తింటున్నారనే ఆరోపణలు ఊపందుకున్నాయి. విడపనకల్లు గోడౌన్‌లో రూ. 27.33లక్షలు, బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడ గోడౌన్‌లో ఒకరి నుంచి రూ.13.13లక్షలు, మరొకరి నుంచి రూ. 1.95 లక్షలు, వజ్రకరూరు మండలంలోని చాబాల గోడౌన్‌లో రూ.2.39లక్షలు రికవరీ చేయాలని కో-ఆప్‌రేటివ్ ఆడిట్ అధికారి పేర్కొన్నారు. ఇప్పటి వరకూ ఏ ఒక్కరికి కనీసం నోటీసు కూడా జారీ చేయలేదు.



ఆడిట్ రిపోర్టులో రూ.44.81లక్షలు రికవరీకి ఆదేశించిన దృశ్యం



రూ. 17లక్షలకు కొన్నట్లు ఉన్న రిజిస్ట్రేషన్ పత్రం



రిజిస్ట్రేషన్ చేయించుకున్న మాజీ సీఈఓ రహంతుల్లా

రూ. 4లక్షలు విలువ చేయని ఇంటికి రూ. 17లక్షలు ఇచ్చినట్లు రిజిస్ట్రేషన్

విడపనకల్లు కో-ఆపరేటివ్ బ్యాంక్ సహకారంతో బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడలో గోడౌన్ నిర్వహించేందుకు 2016లో కాశంసెట్టి వెంకటలక్ష్మమ్మ ఇంటిని కొనుగోలు చేశారు. అప్పటి సీఈఓ షేక్ రహంతుల్లా పేరున అనంతపురంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. కనీసం రూ. 4లక్షలు కూడా చేయని ఆ ఇంటికి రూ. 17లక్షలు చెల్లించినట్లు రిజిస్ట్రేషన్ చేయించారు. ఇక్కడా దాదాపుగా రూ. 13లక్షలు స్వాహా చేశారు. కాశంసెట్టి వెంకటలక్ష్మమ్మను విచారించగా తనకు రూ. 4లక్షలు మాత్రమే ఇచ్చారని తెలిపింది.

పెద్ద కొట్టాపల్లి సొసైటీలో రూ.50లక్షలు పక్కదారి

మండలంలోని పెద్ద కొట్టాల పల్లి సొసైటీలోను రూ. 50లక్షలు పక్కదారి పట్టినట్లు చర్చలు జరుగుతున్నాయి. 2019-20లో అప్పటి సొసైటీ అధ్యక్షుడు వేరుశనగ, ఎరువులు విక్రయాల్లో అవినీతికి పాల్పడి మార్కుఫెడ్ కంపెనీకి దాదాపుగా రూ. 50లక్షలు బకాయి ఉన్నట్లు తెలిసింది. రైతు సేవా సహకార సంఘం పేరుతో లక్షల్లో దోచుకుతింటున్నట్లు ప్రచారం సాగుతోంది.

చెరువుల మరమ్మతుకు నిధులు ఇవ్వాలి

చర్చావేదికలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



చర్చావేదికలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

అనంతపురం కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెరువుల మరమ్మతులకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. జిల్లా సాగునీటి వనరుల పరిస్థితులపై సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 20 వరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన బస్సుయాత్రలో రైతులు వివరించిన సమస్యలపై శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్జీఓ హోంలో మేధావులతో చర్చా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గేయానంద్ మాట్లాడుతూ జిల్లాలో కనీస వ్యవసాయం సాగు కావాలంటే 30శాతం భూమికి సాగునీటి వనరులు కల్పించాలని జాతీయ ఇరిగేషన్ కమిషన్ 1972లోనే సూచించిందన్నారు. విభజన తర్వాత అనంతపురం జిల్లాలో నికరంగా 14.85లక్షల ఎకరాల సాగుభూమి ఉందన్నారు. ఇందులో స్థిరీకరించబడిన ఆయకట్టు 45,224ఎకరాలు, అంటే మొత్తం సాగుభూమిలో కేవలం 3.04శాతం భూమికి మాత్రమే నీటిపారుదల సౌకర్యం ఉందన్నారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు సంవత్సరంలోపు పూర్తి చేయాలని, తుంగభద్ర డ్యామ్‌కు కొత్తగేట్లను అమర్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరపాలని కోరారు. ఈనెలాఖరులో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి, బడ్జెట్ ప్రతిపాదనల్లో జిల్లా సాగునీటి వనరులకోసం నిధులు కేటాయించాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎం బాషా, మానవహక్కుల వేదిక చంద్రశేఖర్, సత్యబోస్, భానుజా, వీకే రంగారెడ్డి, లాయర్ అబ్దుల్ రసూల్, తరిమెల అమర్నాథరెడ్డి, గోవిందరాజులు, భోగేశ్వరరెడ్డి, నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, రామిరెడ్డి, ఆర్వీ నాయుడు, నాగమణి, చంద్రిక, రాయుడు పాల్గొన్నారు.

రేపు గుంతకల్లులో ప్రజాఫిర్యాదుల వేదిక

అనంతపురం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని వచ్చే సోమవారం 28న గుంతకల్లు నిర్వహిస్తామని కలెక్టరు వినోద్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ డివిజనల్(ఆర్డీఓ)ఆఫీస్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఆరోజు తనతో పాటు జేసీ, ఇతరశాఖల ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ అందిస్తామని ఆ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి, 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్ వంటి అంశాల గురించి 35రోజుల పాటు బెంగళూరులో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. శిక్షణా కాలంలో భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామని వెల్లడించారు. ఉద్యోగానికి ఎంపికైన తరువాత నెలకు రూ.15వేలకు పైగా వేతనం చెల్లిస్తారన్నారు. వివరాలకు సెల్ నంబరు 9000487423ను సంప్రదించాలని కోరారు.

పనుల్లో వేగం పెంచండి

పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం

అనంతపురం సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు పనుల్లో మరింత వేగం పెంచాలని ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ జహీర్ అస్లాం పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక ఎస్ఈ కార్యాలయంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పీఐయూ విభాగాల అధికారులు, ఉద్యోగులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా జిల్లాల వారిగా పనులకు సంబంధించిన పలు ఆంశాలపై ఆరా తీశారు. త్వరలో ఉన్నతాధికారులతో పూర్తిస్థాయి సమీక్ష ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు సంబంధించిన సమగ్ర వివరాలు, రికార్డులతో పక్కాగా ఉండాలని సూచించారు. ఎక్కడా పనులు ఆగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు కేవీకేవీ ప్రసాద్, డీఎల్ శ్రీనివాస్, పలువురు డీఈఈలు, జేఈలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సాయి సన్నిధిలో వెనుజులా ఉపాధ్యక్షురాలు

పుట్టపర్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వెనుజులా ఉపాధ్యక్షు రాలు డెల్సి రోడ్రిడ్జ్ ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహాసమాధిని శనివారం దర్శించుకున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తికి వచ్చిన ఆమెకు సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆమె ప్రత్యేక కాన్వాయ్‌లో ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



పోస్టుల కోసం పైరవీలు

31న ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, పీఆర్ ఈఈ ఉద్యోగ విరమణ

- ఎస్ఈగా కర్నూలు నుంచి వచ్చే అవకాశం
- పీఆర్ ఈఈ కోసం జోరుగా సిఫార్సులు
- ఇప్పటికే ఉన్నతాధికారుల వద్దకు ఫైల్స్



పీఐయూ ఈఈ కేవీకేవీప్రసాద్



ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి



ఈఈ శంకరయ్య



ఈఈ చంద్రశేఖర్



పంచాయతీ రాజ్‌శాఖ ఎస్ఈ జహీర్ అస్లాం



ప్రస్తుత ఈఈ ప్రభాకర్‌రెడ్డి



ఎన్‌హెచ్ ఎస్ఈ హరిప్రసాద్

అనంతపురం సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ) ఈఈ, రోడ్లు భవనాలు (ఆర్‌అండ్‌బీ) శాఖ ఎస్ఈ ఈనెల 31వ తేదీన పదవీ విరమణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా స్థానాలకు ఎక్కడి నుంచి ఏ అధికారో వస్తారో.. అని ఆ శాఖ ఉద్యోగుల్లో చర్చసాగుతోంది. కొందరు అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఇప్పటికే తమ ఫైల్స్‌ను ఆయా శాఖల ఉన్నతాధికారులకు అందజేసినట్లు తెలిసింది. రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని పీఐయూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేవీకేవీ ప్రసాద్ ఈనెల 31న పదవీ విరమణ చేస్తున్నారు. చాలా మంది అధికారులు ఆయా పోస్టుల కోసం చేస్తున్న సిఫార్సులు, పైరవీలు ఓ స్థాయిలో ఉన్నాయనే చర్చ జరుగుతోంది.

ఆర్‌అండ్‌బీలో ఎవరికి వారే..

ఆర్‌అండ్‌బీ ఎస్ఈ పోస్టు కోసం అర్హులైన అధికారులు ఎవరి స్థాయిలో వారు విశ్వప్రయాత్నాలు సాగిస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న సురేష్‌బాబు, తిరుపతిలో పనిచేస్తున్న మధుసూదన్‌రావు, నెల్లూరులో పనిచేస్తున్న స్టాండ్‌లీజోన్స్‌తో పాటు కోస్తాలో ఇద్దరు ఈఈలు ఎస్ఈ పోస్టు కోసం ప్రయాత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది. ఇక్కడి ఆర్‌అండ్‌బీ ఎస్ఈ పోస్టుతో పాటు కడప క్వాలిటీ కంట్రోల్, చిత్తూరు ఎస్ఈ పోస్టులు కూడా ఖాళీగా ఉండటంతో ఈ ఆరుగురిలో ఏ అధికారికి ఎక్కడికి పోస్టింగ్ ఇస్తారోనని ఉత్కంఠ రేపుతోంది. అనంతపురం ఆర్‌అండ్‌బీ ఎస్ఈగా కర్నూలులో పనిచేస్తున్న సురేష్‌బాబుకు, చిత్తూరుకు స్టాండ్‌లీ జోన్స్, కడప క్వాలిటీ కంట్రోల్‌కు మధుసూదన్‌రావును నియమించే అవకాశం ఉందని సమాచారం. ఒకవేళ పదోన్నతి ప్రక్రియ ఆలస్యమైతే ఇక్కడే ఎన్‌హెచ్ ఎస్ఈగా పనిచేస్తున్న హరిప్రసాద్‌కు ఇన్‌చార్జి ఎస్ఈగా నియమించే అవకాశం కూడా లేకపోలేదు.

పీఆర్ ఈఈ కోసం సిఫార్సులు

పంచాయతీ రాజ్‌శాఖలో పీఐయూ విభాగం కీలకమైంది. ఇక్కడ రూ. కోట్లలో పనులు జరుగుతుంటాయి. ఇక్కడి ఈఈ కూడా ఈనెల 31న పదవీ విరమణ పొందుతున్నారు. సదరు పోస్టుపై పలువురు అధికారులే ప్రజా ప్రతినిధులు, బడా కాంట్రాక్టర్ల సిఫార్సులతో పోస్టింగ్ కోసం పెద్దఎత్తున ప్రయాత్నాలు సాగిస్తున్నారని తెలిసింది. సదరు శాఖలో ఇటీవల జరిగిన బదిలీల్లో ఆశించిన ప్రాంతాల్లో పోస్టింగ్ లభించక నిరాశ చెందిన ఇద్దరు అధికారులు కూడా ఈ పోస్టు కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు... ప్రస్తుతం ఫారెన్ సర్వీస్‌లో ఇతర శాఖలో పనిచేస్తున్న ఈఈ శంకరయ్య, అనంతపురం డివిజన్ ఈఈగా పనిచేసిన చంద్రశేఖర్ ఈ పోస్టు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారని సమాచారం. అనంతపురం డివిజన్ ఈఈగా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డికానీ, ఆ శాఖ ఎస్ఈ జహీర్‌అస్లాంకు కానీ.. ఇన్‌చార్జి ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. అలా కాకపోతే.. శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు ఈఈల్లో ఒకరిని ఇన్‌చార్జిగా నియమించే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ప్రధానంగా శంకరయ్య, చంద్రశేఖర్‌లలో ఒకరిని నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

ప్రైవేటు ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- డాక్టర్ల వివరాలు ప్రదర్శించాలి
- ఆరోగ్యవంతమైన జిల్లాగా మారుద్దాం
- వైద్యశాఖ సమీక్షలో కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, లేకపోతే చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య శాఖాధికారులకు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రతి ఆసుపత్రిలోనూ రిజిస్ట్రేషన్ కాపీతో పాటు అక్కడ పని చేస్తున్న డాక్టర్లు, వారు చదివిన సర్టిఫికెట్లు, ఎన్ని గదులు, ఎన్ని పడకలు, వాష్‌రూమ్స్ తదితర వివరాలు మొత్తం ఆవరణంలోని డిస్‌ప్లే బోర్డులో ప్రదర్శించాలన్నారు. జిల్లాలో 528 ఆసుపత్రులు ఉన్నాయని, వీటి వివరాలు పూర్తిగా తెలియజేసే విధంగా ఎక్సెల్ షీట్‌లో నమోదు చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలు కూడా సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐఎంఏ, ఆప్నా, ప్రైవేట్ ఆసుపత్రుల అసోషియేషన్లు జిల్లాలోని కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని మహిళలు, చిన్నపిల్లలకు అవసరమైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్లు సమష్టిగా పని చేసి అనంతను ఆరోగ్యవంతమైన జిల్లాగా మార్చాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీఎంహెచ్ఓ ఈబీ దేవి, ఐఎంఏ అధ్యక్షుడు మురళీక్రిష్ణ, ఆప్నా అధ్యక్షుడు విజయకుమార్, థామస్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ఆర్డీటీ హెల్త్ డైరెక్టర్ రవిప్రసాద్‌రావు, డెమోలు త్యాగరాజు, గంగాధర్, పలువురు వైద్యాధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాళిక తయారు చేయండి

ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ ఆనంద్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు ప్రణాళిక తయారు చేయాలని అటవీ శాఖ సిబ్బందిని ఇన్‌చార్జి డీఎఫ్ఓ ఆనంద్ ఆదేశించారు. అటవీశాఖ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నదానిపై శనివారం అటవీశాఖ కార్యాలయంలోని డీఎఫ్ఓ చాంబర్‌లో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ అటవీశాఖకు నిధుల కేటాయించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడానికి అధికారులు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. నర్సరీల అభివృద్ధికి ఎలాంటి మొక్కలు అందుబాటులో ఉంచాలి? ఎలాంటి ప్రాంతాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి? వణ్యప్రాణుల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించారు. రేంజర్లు శ్రీనివాసులు, మధుబాబు, సెక్షన్ ఆఫీసర్లు నారపరెడ్డి, ప్రవీణ్‌కుమార్, అక్బర్ పాల్గొన్నారు.

పింఛన్ పత్రాలకు ప్రత్యేక కౌంటర్లు

- మంగళ, శుక్రవారాల్లోనే వైద్య పరీక్షలు
- సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు



హెచ్ఓడీలతో సమీక్షిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ పత్రాల కోసం వచ్చే వారికి జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం వైద్యాధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పరీక్షల కోసం ఉమ్మడి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వస్తుండడంతో ఎలాంటి చర్యలు తీసుకుందామని ఆర్ఎంఓలు, హెచ్ఓడీలతో చర్చించారు. ఈ తాకిడిని నిలువరించడం కోసం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మంగళ, శుక్రవారాలలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆ రోజుల్లో ముందుగా తెలిపిన మేరకు పేషెంట్లు రావచ్చని, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రిజిస్ట్రేషన్ చేసుకుంటామన్నారు. 2 గంటల నుంచి 4 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న పేషెంట్లకు సంబంధిత డాక్టర్లు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. ఆసుపత్రి ఆవరణంలో ఉన్న డీఈఐసీ సెంటర్, బర్న్‌వార్డు, సాధారణ ఓపీ కేంద్రాలలో కౌంటర్లు ఏర్పాటు చేస్తామని వివరించారు. అక్కడ డాక్టర్లు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. సమావేశంలో ఆర్ఎంఓ హేమలత, హెచ్ఓడీలు భీమసేనాచారి, భాస్కర్, ఆత్మారామ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

కేఆర్ నారాయణన్ (జయంతి)



దేశ పదో రాష్ట్రపతిగా 1997-2002 వరకు వ్యవహరించిన కొచెరిల్ రామన్ (కేఆర్) నారాయణన్ 1920 అక్టోబరు 27న కేరళ రాష్ట్రం ఉఝవూర్‌లో జన్మించారు. 1992-97 వరకు ఉప రాష్ట్రపతిగా వ్యవహరించారు. అంతకుముందు కేంద్ర విదేశాంగ శాఖలో కీలకంగా పని చేశారు. ఐఎఫ్ఎస్‌ను వీడి రాజకీయాల్లోకి వచ్చి ఇందిరాగాంధీ సూచనతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి వరుసగా మూడుసార్లు గెలుపొందారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకటించుకుని రాష్ట్రపతిగా తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. 2005 నవంబరు 5న కన్నుమూశారు.

శివకుమార్ (పుట్టినరోజు)



అలనాటి తమిళ నటుడు శివకుమార్ 1941 అక్టోబరు 27న కోయంబత్తూరులో జన్మించారు. అసలు పేరు పళనిస్వామి. 200కు పైగా సినిమాలలో నటించారు. 3 ఫిల్మ్‌ఫేర్, 2 తమిళనాడు రాష్ట్ర అవార్డులు పొందారు. మూడు తరాల నటులతో కలసి నటించారు. అగరం ఫౌండేషన్ ద్వారా ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేస్తూ యువతలో చైతన్యం కల్పిస్తున్నారు. కాగా ఆయన కుమారులు సూర్య, కార్తిలు కూడా నటులుగా రాణిస్తూ ఎంతో పేరొందారు.

అనురాధా పౌడ్వాల్ (పుట్టినరోజు)




నేపథ్య గాయని 'పద్మశ్రీ' గ్రహీత అనురాధా పౌడ్వాల్ 1954 అక్టోబరు 27న ఉత్తరకన్నడ జిల్లా కార్వారలో జన్మించారు. నేషనల్ ఫిల్మ్ అవార్డు, నాలుగుసార్లు ఉత్తమ గాయనిగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారం, మహ్మద్ రఫీ అవార్డు, మదర్ థెరెసా అవార్డు జీవనసాఫల్య పురస్కారం, ఇతర గౌరవాలు అందుకున్నారు. ఆమె ఆలపించిన పాటలు ఎక్కువగా టి-సిరీస్ ద్వారా భజనలు, అనేక ఆల్బమ్‌లు విడుదలయ్యాయి. తెలుగు, హిందీ, కన్నడ, రాజస్థానీ, మరాఠీ, బెంగాలీ, సంస్కృతం, గుజరాతీ, ఒరియా పంజాబీ, నేపాలీ తదితర భాషలలో పాటలు పాడారు. డివై పాటిల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా తన సంపాదనలో కొంతమొత్తాన్ని సైనిక, పేద కుటుంబాల సాయానికి ఖర్చు చేయడం విశేషం. ఇటీవల ఆమె బీజేపీలో చేరి రాజకీయాలపై ఆసక్తి కనబరిచారు.

సంగక్కర (పుట్టినరోజు)



శ్రీలంక దేశ క్రికెటర్ కుమార సంగక్కర 1977 అక్టోబరు 27న జన్మించారు. శ్రీలంక క్రికెట్ జాతీయ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. తన 15ఏళ్ల కెరీర్‌లో గొప్ప బ్యాట్స్‌మెన్‌గా, వికెట్ కీపర్‌గా గుర్తింపు పొందారు. 2012లో ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచారు. 2014 ఐసిసి వరల్డ్ ట్వంటీ-20లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచి ట్రోఫీని దక్కించుకున్నారు. వన్డేలలోనూ, టెస్టుమ్యాచ్‌లలోనూ అనేక రికార్డులు సాధించారు. కామెంటేటర్‌గాను వ్యవహరించారు. 2021లో ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు కోచ్‌గా వ్యవహరించారు. కాగా ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేంలో చోటు పొందారు. యునిసెఫ్, యూఎన్‌లు చేపట్టిన సామాజిక అంశాలపై చైతన్యం కల్పించడంలో క్రియాశీలకంగా ఉన్నారు.

ఇర్ఫాన్ పఠాన్ (పుట్టినరోజు)



ఇర్ఫాన్ పఠాన్ 1984 అక్టోబరు 27న గుజరాత్ రాష్ట్రం వడోదరలో జన్మించారు. బౌలర్‌గానేకాక ఆల్‌రౌండర్‌గా రాణించారు. ఇండియన్ క్రికెట్ టీమ్‌లో తనదైన గుర్తింపు పొందారు. 2007 ఐసీసీ ట్వంటీ-20 వరల్డ్ కప్, 2013 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలోనూ తన ప్రతిభను చాటారు. 2020లో క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. సోదరుడు యూసుఫ్‌ఖాన్‌తో కలసి క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేశారు.

వాతావరణ మార్పులను అధిగమించే పరిశోధనలు జరగాలి

▸▸ నందన్ నీలేకణి పిలుపు



సదస్సులో నందన్ నీలేకణి, తదితరులు

బెంగళూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల సంక్లిష్ట పరిస్థితి నుంచి అధిగమించేందుకు ప్రపంచ దేశాలు సిద్ధమయ్యాయని అందుకు తగిన పరిశోధనలు జరగాలని ఫౌండేషన్ ఫర్ ఇంటర్ అపెరబిలిటీ ఇన్ డిజిటల్ ఎకనమి కో-ఫౌండర్, ఇన్ఫోసిస్ ముఖ్యులు నందన్ నీలేకణి అభిప్రాయపడ్డారు. శనివారం నగరంలో డెక్కన్ నోడ్ జీరో 2024 సదస్సు జరిగింది. వాతావరణ మార్పుల పరిష్కారాలకు సంబంధించి పర్యావరణ నిపుణులు భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా నందన్ నీలేకణి మాట్లాడుతూ డిజిటల్ మౌలిక సదుపాయాలు దేశంలో భారీగా మార్పులు వచ్చాయన్నారు. వీటిని సాధనలుగా భావించాలని అయితే ప్రపంచంలో తలెత్తుతున్న సమస్యలను అధిగమించేందుకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పులు ప్రపంచానికి పెను సవాల్‌గా మారుతున్నాయన్నారు. టోకనైజేషన్ ఆఫ్ అసెట్స్ సృష్టించి ట్వింటర్‌నెట్ ఆర్థిక వ్యవస్థను మార్పు చేయడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. దేశంలో సాంకేతిక సామర్థ్యానికి కొదవలేదని రానున్న కాలంలో మరిన్ని ఆవిష్కరణల ద్వారా వాతావరణ మార్పుల ద్వారా తలెత్తే సమస్యలను అధిగమించేందుకు సిద్ధం కావాలన్నారు. మరో కో-ఫౌండర్ డాక్టర్ ప్రమోద్‌వర్మ మాట్లాడుతూ సహభాగత్వం, పారదర్శకత, పర్యావరణ సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై పలువురు సంతృప్తి వ్యక్తం చేశారు. సెంటర్ ఫర్ ఎక్స్‌పోన్షియల్ చేంజ్ సీఈఓ, క్యూరేటర్ సంజయ్ పురోహిత్ చర్చాగోష్ఠిని పర్యవేక్షించారు.

దేవెగౌడ నివాసానికి ఉపరాష్ట్రపతి



ఉపరాష్ట్రపతి దంపతులకు జ్ఞాపిక అందచేస్తున్న మాజీ ప్రధాని దేవెగౌడ, కేంద్రమంత్రి కుమారస్వామి

బెంగళూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపర్యటనకు వచ్చిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ శనివారం మాజీ ప్రధాని దేవేగౌడ నివాసానికి వెళ్లారు. ఉదయం మాజీ ప్రధాని నివాసానికి వెళ్లిన ఉపరాష్ట్రపతి సుమారు గంటకుపైగా గడిపారు. దేవేగౌడ భార్య చన్నమ్మ ఆరోగ్య పరిస్థితిని ఉపరాష్ట్రపతి అడిగి తెలుసుకున్నారు. కేంద్రమంత్రి కుమారస్వామితో కలసి అల్పాహార విందు తీసుకున్నారు. కాగా శుక్రవారం ఆదిచుంచనగిరి విద్యాసంస్థలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్, మాజీ ప్రధాని దేవేగౌడలు పాల్గొన్నారు. ఇదే సందర్భంలోనే ఉపరాష్ట్రపతిని అల్పాహార విందుకు ఆహ్వానించిన మేరకు వెళ్లారు. దేవేగౌడ మనవడితో ఉపరాష్ట్రపతి సరదాగా గడిపారు. ఇరువురు వ్యవసాయం, అన్నదాతల కష్టాలు, రైతుల అభివృద్ధికి సంబంధించి చర్చించుకున్నట్టు సమాచారం.

రేడియాలజీ చికిత్సా విధానానికి మార్గదర్శకం



సిర్కాన్ సదస్సులో డాక్టర్ రోహిత్ తదితరులు

బెంగళూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌వెర్షనల్ రేడియాలజీ చికిత్సా విధానానికి అద్భుతమైన మార్గదర్శకం, ప్రగతికి కారణం కానుందని ప్రముఖ వైద్యులు రోహిత్ మధురకర్ అభిప్రాయపడ్డారు. నగరంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ వాస్క్యులర్ అండ్ ఇంటర్‌వెర్షనల్ రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో సిర్కాన్ 2024 పేరిట ప్రత్యేక సదస్సు జరిగింది. సొసైటీ అధ్యక్షులు రోహిత్ మధురకర్ మాట్లాడుతూ అత్యాధునిక రేడియాలజీ ద్వారా రోగుల ఆపరేషన్‌లకు సంబంధించి సమగ్రతను సూచిస్తుందన్నారు. వాస్క్యులర్ రేడియాలజీ వైద్య నిపుణులు ఇటీవల సాంకేతిక ప్రగతి సాధనలకు సంబంధించి సదస్సులో ప్రస్తావించారు. సొసైటీ ఉపాధ్యక్షుడు ధీరజ్ తివారి, కార్యదర్శి రాజేశ్ హాళవర, కోశాధికారి మధు ఎస్‌డితోపాటు సభ్యులు పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థికి పురస్కారం



కవనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బెంగళూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ (నాసా స్పేస్ సెటిల్ మెంట్) రోడ్‌మ్యాప్ ఆర్ట్ పోటీలలో నగరంలోని నందిని లేఅవుట్ శాఖ నారాయణ పాఠశాలలో ఏడోతరగతి చదివే కవనకు ప్రత్యేక పురస్కారం లభించింది. ఈమేరకు శనివారం నారాయణ సంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర, పి.శరణిలు ప్రత్యేకంగా కవనను అభినందించారు. ఇదే సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 10-25 ఏళ్లలోపు విద్యార్థులలో ఎన్ఎస్ఎస్ అంతరిక్ష పరిశోధనలకు సంబంధించిన అంశాలపై ఏటా పోటీలు జరుపుతుందన్నారు. సాంకేతిక, పర్యావరణ కల్పనలతో పోటీలు ఉంటా యన్నారు. ఇటీవల ఇస్రో అంతరిక్ష ప్రయోగాల సాధనల ద్వారా అన్ని వర్గాలకు భారతీయ శాస్త్రవేత్తల గొప్పదనం తెలిసిందన్నారు. ఎన్ఎస్ఎస్ పోటీలలో విద్యార్థిని కవన సాధించిన ఘనత తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయ కమన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

పర్యావరణంపై చైతన్యం



ఎకోవరల్డ్ హబ్బలో ఉత్సాహంగా ఇలా..

బెంగళూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణంపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు బ్రూక్‌ఫీల్డ్ ప్రాపర్టీస్‌కు అనుబంధంగా కొలాబ్‌హౌస్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలో ఎకో వరల్డ్ హబ్బను నిర్వహించారు. నగరంలోని బ్రూక్‌ఫీల్డ్ మాల్‌లో జరిగిన హబ్బలో 50కుపైగా వర్క్‌షాప్‌లు, స్థానిక కళాకారులు భిన్నమైన ప్రదర్శనలతో ఆకట్టుకున్నాయి. కొలాబ్‌హౌస్ సంస్థ ఫౌండర్, ప్రఖ్యాత కళాకారిణి ఊర్మిత శర్మ, 3 ప్రదర్శనలతో ప్రత్యేకత అనిపించుకున్నారు. బ్రూక్‌ఫీల్డ్ ప్రాపర్టీస్ సీఓఓ శంతను చక్రవర్తి మాటాడుతూ నగర ప్రజలను ఒక చోటకు చేర్చడమే ఎకో వరల్డ్ హబ్బ ప్రధాన ఆశయమన్నారు.

ఆహార నాణ్యత పరీక్షలకు మ్యాజిక్ బాక్స్

▸▸ స్పాట్ టెస్ట్ కియోస్క్ ఆరంభం



కియోస్క్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దినేశ్ గుండూరావు

బెంగళూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో లభించే ఆహార పదార్థాల నాణ్యతను పారదర్శకంగా పరిశీలించేందుకోసం మ్యాజిక్‌బాక్స్ పేరిట ఫుడ్ టెస్టింగ్ కియోస్క్‌లు సహకారం కానున్నాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు అభిప్రాయపడ్డారు. ఆహార సురక్షత, నాణ్యతలను పరిశీలించే వినూత్న ప్రయత్నాన్ని కొడిగేహళ్ళిలోని మాల్ ఆఫ్ ఏసియాలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దినేశ్ గుండూరావు మాట్లాడుతూ ఆహార పదార్థాల నాణ్యతను త్వరితగతిన ప్రయోగాత్మకంగా పరీక్షలు జరిపేందుకు మ్యాజిక్ బాక్స్ పనిచేయనుందన్నారు. ఇంట్లో వంట చేసేటప్పుడు సహజసిద్ధమైన కల్తీలేని వస్తువులను ఉపయోగిస్తామన్నారు. అయితే బయట తినే ఆహార పదార్థాలలో ఆకర్షణీయంగా ఉండేందుకు రసాయనాలు, రుచిని పెంచే టేస్ట్ మేకర్‌లను ఉపయోగిస్తారన్నారు. వారు లాభదాయకం కోసం ఇటువంటి చర్యలకు పాల్పడతారన్నారు. ఇటీవలికాలంలో మారిన జీవనశైలి ఆహార పద్ధతులు, కలుషితమైన పర్యావరణంలో జీవిస్తున్నామన్నారు. అందుకే చిన్న వయస్సులోనే మధుమేహం, గుండెపోటు ఇతరత్రా జబ్బులు వస్తున్నాయన్నారు. జీవనశైలిని మార్చుకుని ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అందుకే నగరవ్యాప్తంగా ఆహార ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించేందుకు 230 నమూనాలు సేకరించగా 224 సురక్షితమని తేలిందన్నారు. రాష్ట్రంలోని రైల్వే స్టేషన్‌లలోనూ ఇటువంటి ప్రయోగం చేశామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో పేరొందిన పది మాల్స్‌లో ఇటువంటి కియోస్క్‌లు తెరిచామన్నారు. మాల్ ఆఫ్ ఏసియా జీఎం సతీశ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

అవినీతి నియంత్రణపై

యవతకు అవగాహన అవసరం



సమావేశంలో మాజీ లోకాయుక్త సంతోష్ హెగ్డే తదితరులు

బెంగళూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అవినీతి నియంత్రణపై యువతలో చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డే అభిప్రాయపడ్డారు. నగరంలోని కన్నడ భవనంలోని నయన సభాంగణంలో రాష్ట్ర సమాచార హక్కు, సామాజిక కార్యకర్తల వేదిక ఆధ్వర్యంలో సమాచార హక్కు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐదో వార్షికోత్సవంలో భాగంగా విచారక్రాంతి రత్న పురస్కారం ప్రదానంలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో తీవ్ర ప్రభావం చూపుతున్న లంచాన్ని నియంత్రించేందుకు చక్కటి సమాజం కోసం యువత పాటుపడాలని అభిప్రాయపడ్డారు. విద్యతోపాటు చక్కటి ఆలోచనలు, భావాలు పెంచుకోవాలన్నారు. సమాచార హక్కు అధ్యయన కేంద్రం వీరేశ్ బెళ్ళూర్, సంస్థాపకుడు హెచ్‌జి రమేశ్ కుణిగల్, రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య ఎం వస్త్రద్, కార్యాధ్యక్షుడు ఓంకారప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహగౌడ, ప్రధాన కార్యదర్శి హెచ్‌డి రుద్రేశ్, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

▸▸ పీఈఎస్ సదస్సులో స్వామి వీరేశానంద సూచన



వీరేశానంద స్వామిజీని సత్కరిస్తున్న చాన్స్‌లర్ దొరస్వామి

బెంగళూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సమాజంలో సమయం అందరికీ సమానమని విద్యార్థులు ప్రతి నిమిషాన్ని అమూల్యమైన శక్తిగా హెచ్చరిక కలిగి ఉంటేనే భవిష్యత్తు సాధ్యమని తుమకూరు రామకృష్ణ వివేకానంద ఆశ్రమ ముఖ్యులు స్వామి వీరేశానంద సరస్వతి అభిప్రాయపడ్డారు. పీఈఎస్ పీయూ కళాశాల విద్యార్థులకోసం యూనివర్సిటీలో శనివారం విద్యార్థుల ముందున్న సవాళ్లు, వాటికి సరైన సమాధానం అనే అంశంపై చర్చాగోష్ఠి జరిగింది. పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరేశానంద స్వామి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జీవనం అంటే జీవం, జీవనానికి తయారయ్యే ఉత్తమమైన మార్గదర్శకాన్ని అనుసరించడమన్నారు. విద్యార్థి దశ జీవితంలో కీలకమైనదన్నారు. ప్రతిక్షణం చదువుపై ధ్యాస పెంచుకోవాలన్నారు. అక్షరమనే విజ్ఞానం పోరాటంగా భావిస్తే మీ జీవన ప్రయాణం ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందన్నారు. జీవన ప్రయాణంలో విద్యార్థిదశ ఇంజన్‌లాంటిదన్నారు. సమాజంలో రెండు రకాల మనుషులు ఉంటారని కొందరు ఆశలు మాత్రమే పెట్టుకుంటారని మరికొందరు కలల సాధనకోసం ప్రయత్నిస్తారన్నారు. సాధించాలనే లక్ష్యం ఉంటే వెనక్కి చూడకూడదన్నారు. పీఈఎస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి మాట్లాడుతూ భగవంతుడి సృష్టిలోని మనిషిజన్మ అత్యంత పవిత్రమైనదని, సార్థం చేసుకోవాలన్నారు. మంచి నేర్చుకోవాలని, చదువుతోనే ప్రపంచంలో అగ్రగాములుగా నిలిచేందుకు సాధ్యమన్నారు. శిక్షణ అంటే జాతీయతను నిర్మించే ప్రక్రియ అన్నారు. రాజీలేని పోరాటంతో ఉత్తమ సాధనలకు పీయూ విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పీఈఎస్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కేఎస్ శ్రీధర్, హనుమంతనగర క్యాంపస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎంవీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ సీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాలూకా కార్యాలయంలో

కానరాని పరిశుభ్రత



కార్యాలయ ప్రాంగణంలో పాచిపట్టిన దృశ్యం

దొడ్డబళ్ళాపుర, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దొడ్డబళ్ళాపుర తాలూకా కేంద్రంలో స్వచ్ఛత కొరవడింది. కార్యాలయానికి నిత్యం పేద, ధనిక తేడా లేకుండా ప్రజలు వస్తుంటారు. సాధారణంగా దేశవ్యాప్తంగా మ్యాన్‌హోల్స్‌ను స్వచ్ఛ పరిచేందుకు దిగి పౌరకార్మికులు ఊపిరి అందుకోక ఎంతోమంది మృతి మృత్యువాత చెందుతుంటారు. ప్రస్తుతం తాలూకా కార్యాలయం వద్ద నెలకొన్న దుర్గంధం కూడా ఊపిరి తీసుకునేందుకు ఇబ్బంది పడేలా ఉందంటే ఆశ్చర్యం ఉండదు. మినీ విధానసౌధలో ఉపవిభాగాధికారి, తాలూకా కార్యాలయం ఒకే వైపు ఉన్నాయి. రెవెన్యూ, ఆహార, ట్రెజరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ తదితరశాఖలు ఇక్కడ ఉన్నాయి. ఇక్కడి సిబ్బంది, కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఇక్కడి శౌచాలయం ఉంది. అయితే శౌచాలయం సమీపంలోని గుంత నుంచి పాచికట్టి దుర్గంధం వ్యాపిస్తున్నా బాగు చేసేందుకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇకనైనా బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడల్లోనూ రాణించండి



ప్రసంగిస్తున్న బీఈఓ నరేంద్రకుమార్

శిడ్లఘట్ట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని బీఈఓ నరేంద్రకుమార్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని నెహ్రూ క్రీడామైదానంలో విద్యాశాఖ ఏర్పాటు చేసిన తాలూకా స్థాయి ప్రాథమిక, హైస్కూల్ స్థాయి క్రీడాపోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో సత్తా చాటుకోవడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉందన్నారు. తాలూకా ఫిజికల్ డైరెక్టర్ దేవంద్రప్ప మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం శారీరకంగా, మానసికంగా రాణించడం సాధ్యమన్నారు. క్రీడల్లో గెలుపోటములను ఆశావహంగా తీసుకోవాలన్నారు.

రేపటి నుంచి పది పరీక్షల ఫీజు చెల్లింపు

కొత్తచెరువు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజును ఈనెల 28 నుంచి నవంబరు 11లోపు చెల్లించాలని అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి జి.కిష్టప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా చెల్లించాలన్నారు. మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఉన్నవారు రూ.125, మూడు కంటే తక్కువ సబ్జెక్టులు ఉన్నవారు రూ.110, ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజుతోపాటు అదనంగా రూ.60 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో అప్లికేషన్ లింకు వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.

రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే

చేళూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన చేళూరులో రోడ్ల పరిస్థితిని బాగేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం చేళూరులోని పలు రోడ్లను స్వయంగా పరిశీలించారు. రోడ్ల మరమ్మత్తులకు త్వరలోనే చర్యలు చేపడతామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలతో కొన్ని చోట్ల రోడ్లు మరీ అధ్వానంగా మారినట్టు గుర్తించామన్నారు. సాధ్యమైనంత త్వరగా రోడ్లను బాగు చేస్తామన్నారు.



స్థానికులతో కలసి చర్చిస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

కుట్టుయంత్రాల పంపిణీ



కుట్టుమిషన్లను అందచేస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మహిళల స్వావలంబనకోసం దేవరాజ్ అరసు వెనుకబడిన వర్గాల శాఖ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే నారాయణస్వామి తెలిపారు. పట్టణంలోని ఎస్ఎన్ రిసార్టులో శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో లబ్ధిదారులకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోరుబావులకోసం రైతులకు మోటారులను ఇస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 36మందికి కుట్టుమిషన్లు అందచేశారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు గోవింద, దేవరాజ్ అరసు వెనుకబడిన వర్గాలశాఖ మేనేజర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.96	1,609.67
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	19,510	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	17,794	9,612
నీటి నిల్వ (టీఎంసీలు)	101.62	36.93

పేటే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

సిరుగుప్ప, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : పేటే ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాలుకాలో ప్రసిద్ధి చెందిన పేటే ఆంజనేయ స్వామికి ప్రధాన అర్చకులు శ్యామాచార్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాముల వారికి పుష్పాలంకార సేవలు చేశారు. భక్తులు స్వాముల వారికి ధూప దీప నైవేద్యాలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ చేపట్టారు. దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.



అలంకరణలో హనుమంతుడు

మొక్కజొన్నకు మొలకలు



మొలకలు వచ్చిన పంటను చూపుతున్న రైతు

కంప్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : ఇటీవల కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న పంటకు కలంలోనే మొలకలు వస్తున్నాయి. విజయనగర తాలుకా పరిధిలోని పలు గ్రామాల్లో వర్షం కారణంగా మొలకలు వచ్చి తీవ్రంగా నష్టపోతున్నామని రైతు తిప్పన్న వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశానని, పంట ఎదుగుదల బాగా వచ్చి దిగుబడి కూడా బాగా వచ్చింది. అయితే తీరా అమ్ముకుందామని అనుకునే సమయంలో వర్షాలతో కలంలోనే మొలకల వచ్చి పంట దెబ్బ తినిందన్నారు. వర్షం కారణంగా నష్టపోయిన తమను ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అదుపు తప్పి వాగులో దిగిన బస్సు



వాగులోకి దిగిన ఆర్టీసీ బస్సు

రాయచూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): లింగసుగూరు డిపోకు చెందిన రోడ్డు రవాణ సంస్థ బస్సు శనివారం అదుపు తప్పి వాగులోకి దిగిపోయింది. లింగసుగూరు నుంచి బెండోణ ఆనెహోసూరు మీదుగా నాగరాళకు వెళ్లాల్సిన బస్సు సాంకేతిక లోపంతో ఒక్కసారిగా అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న వాగులోకి బస్సు దిగిపోవడంతో బస్సులో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 15 మంది ప్రయాణీకులున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సండూరు అభివృద్ధిపై కాంగ్రెస్ నిర్లక్ష్యం

● ఇన్నేళ్లుగా గెలిపించినా రుణం తీర్చుకోని నాయకులు ● బీజేపీని ఓటేసి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి : మాజీ మంత్రి గాలి

బళ్లారి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సండూరు అభివృద్ధిపై కాంగ్రెస్ నిర్లక్ష్యం వహిస్తోందని, స్వతంత్ర్యం వచ్చిన నాటి నుంచి గెలిపించినా ఈ ప్రాంతానికి ఒరిగిందేమీ లేదని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి ధ్వజమెత్తారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బీజేపీ నాయకులు సండూరు నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి బి. శ్రీరాములు, బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంత తదితరులు పాల్గొన్నారు. బంఢ్రి, బంఢ్రి గొల్లపుర్, కోడిహళ్లి, కటినకంబ, ఉత్తరమలై, యశ్వంత్ నగర్, సోమాపుర్‌లో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసంద్భంగా గాలి జనార్దన్‌రెడ్డి మంత్రి సంతోష్ లాడ్, ఎంపీ తుకారాం లను ఘాటుగా విమర్శించారు. తుకారాం, సంతోష్ లాడ్ ఇప్పటికి అనేక ఏళ్ల మంత్రులుగా, అలాగే ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఇక్కడ ప్రజలకు ఏమి చేశారో చూపించాలన్నారు. బీజేపీని గెలిపించి కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. దివాకర్, అలీఖాన్, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తదిరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి గాలిజనార్దన్ రెడ్డి

బాలుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడు ఓబులేసు



బాలుడు అభి (ఫైల్)

బళ్లారి సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కమలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడేళ్ల బాలుడిని అపహరించి హెచ్‌ఎల్‌సీ కాలువలో పడేసి హత్య చేసిన నిందితుడు ఓబులేసును పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం ఎస్పీ శ్రీహరిబాబు తెలిపిన వివరాల మేరకు అక్టోబరు 22న కమలాపురానికి చెందిన అభి(7) అనే బాలుడిని అపహరించి అనంతరం హెచ్‌ఎల్‌సీ కాలువ వంతెనపై నుంచి బాలుడిని కాల్వలోకి తోసేశాడు, అదే రోజు బాలుడి తల్లి కమాపురం పోలీస్‌స్టేషన్‌లో బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం కురేకుప్ప సమీపంలోని కాలువలో బాలుడి మృత దేహం లభ్యమైంది. నిందితుల కోసం గాలింపు చేపట్టారు. 22న పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి నిందితుడు ఓబులేశ్ తన స్కూటీపై బాలుడిని తీసుకెళ్లాడు. అతని కదలికలపై సీసీటీవీ ఈ దృశ్యాలను పరిశీలించగా బాలుడిని పాఠశాల నుంచి తన వెంట తీసుకొచ్చినట్లు కనిపించింది. అతడిని విచారించగా పీకే హళ్ళి కోడ్డులోని కాలువ (హెచ్‌ఎల్‌సీ కెనాల్)లో బాలుడిని పడేసినట్లు అంగీకరించారు. అక్రమ సంబంధానికి అబ్బాయి అడ్డుగా ఉండడంతోనే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. చనిపోయిన బాలుడి తల్లికి, ఓబులేశ్‌కు మధ్య సానిహిత్యం ఉండేది. దీంతో ఆమె తన భర్తకు విడాకులు ఇచ్చి ఓబులేశ్‌ను పెళ్లాడేందుకు సిద్ధమయ్యింది. బాలుడు అడ్డుగా ఉన్నాడని భావించిన ఓబలేశ్ అతడిని అంతం చేయాలని ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. కానీ తల్లికి బిడ్డను చంపే ఉద్దేశం లేదు. ఆమె తప్పిపోయిన ఫిర్యాదును దాఖలు చేయడమే కాకుం డా అమెను విచారించినప్పుడు ఓబులేశ్ చేసిన ఘాతుకాన్ని విని షాక్ అయ్యింది. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు.

టపాసుల విక్రయ స్థలం పరిశీలన



శామియాచంద్ పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

కంప్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేయనున్న టపాసుల దుకాణాలను అధికారులను పరిశీలించారు. పట్టణంలో ఏటా శ్యామియా చంద్ పాఠశాల ఆవరణంలో టపాసుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసేవారు. కానీ ఈ యేడాది అక్కడ పరీక్షలు వుండటంతో వాల్మీకి సర్కిల్ వాలికొట్రప్ప స్థలంలో ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మకాలు చేపట్టాలన్నారు. పోలీస్‌స్టేషన్, కేఏబీ, రెవెన్యూ అధికారులతో షాపుల యజమానులు దరఖాస్తు చేసుకుంటే జిల్లా అధికారులకు తెలియజేస్తామన్నారు. దుకాణాల వద్ద అగ్నిప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో ఏడీ మల్లన్నగౌడ, ముఖ్య అధికారి దుర్గన్న, కేఈబీ అధికారి మల్లికార్జున గౌడ, చంద్రశేఖర్, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయక ప్రాంతం కళ్యాణ కర్ణాటక

● వెనుకబడినదిగా చెప్పుకోవడం సరికాదు: రాయచూరు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ హరీశ్ రామస్వామి

రాయచూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్య సాంస్కృతిక కళారంగాల్లో అత్యంత స్ఫూర్తీదాయ పాత్రను పోషించిన కల్యాణ కర్ణాటక-కర్ణాటక ప్రాంతం అన్ని ప్రాంతాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని రాయచూరు విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ హరీశ్ రామస్వామి పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని వెనకబడిన ప్రాంతంగా చెప్పుకోవడం సరికాదన్న ఆయన వివిధ రంగాల్లో నిష్ణాతులు, నిపుణులు, అనుభవజ్ఞులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో గుర్తింపు పొందిన ప్రముఖులకు ఈ ప్రాంతం ఆలవాలమని గుర్తు చేశారు. రాయచూరు విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో శనివారం దేవదుర్గ పట్టణంలోని బసవ జూనియర్,డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వార్షిక ప్రచార ఉపన్యాస మాలా 05 ఉత్సవాన్ని వైస్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రొఫెసర్, సాహిత్య, సాంస్కృతిక, సంగీత కళా రంగాల్లో ఈ ప్రాంతం అనేక రకాల కీర్తిని గడించిందని ఎందరో మహనీయులు, విద్వాంసులు, విషయ పరిజ్ఞానం ఉన్న మేధావులు పుట్టిన గడ్డగా కల్యాణ కర్ణాటక ప్రాంతానికి పేరుందన్నారు. విద్యరంగంలోని ఈ ప్రాంతానికి సుదీర్ఘ చరిత్ర ఉందని ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థులు తమ సాంస్కృతిక, చరిత్ర వారసత్వాన్ని ఆకళింపు చేసుకుని మేధావులుగా కాణించేందుకు వివిధ రకాల సాధన సాగించాలన్నారు. కాగా విద్యార్థులు జ్ఞాన శక్తిని పెంచుకోవాలని ఆకరికి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ప్రస్తుత సమాజంలో ఉన్న అన్ని అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. విషయ పరిజ్ఞానం ఉన్న మేధావులు చెప్పిన విషయాలను ఆకళింపు చేసుకోవాలని తద్వార తాము సహితం భవిష్యత్తు తరాలకు విజ్ఞాన సంపదను అందించేందుకు కృషి సాగించాలని విద్యార్థులకు ఉద్బోధించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ హరీశ్ రామస్వామి

భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీశుడి ఆలయం

కదిరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆశ్వయుజ మాసం చివరి శనివారం కావడంతో పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే బారులుతీరారు. స్వామివారి ధ్వంజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. ఆలయానికి శుక్రవారం రాత్రే పలువురు చేరుకున్నారు. దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయ అధికారులు సౌకర్యాలు కల్పించారు.



స్వామివారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ తుకారామ్

కాంగ్రెస్ అభ్యర్థి విస్తృత ప్రచారం

తోరణగల్లు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికల ప్రచారం జోరందుకుంది. శనివారం కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ తుకారామ్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. నిదగుర్తి, మల్లాపురం, కొండాపురం, పులికుంట తదితర గ్రామాల్లో పర్యటించిన ఆమె కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ నాయకులు మంత్రి సంతోష్ లాడ్, ఎంపీ తుకారామ్ సహకారంతో పేదలకు, విద్యార్థులకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఐదు గ్యారెంటీ పథకాలను ఇప్పటికే దిగ్విజయంగా అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జయరాం, వీరేష్ స్వామి, రవి కుమార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బళ్లారి సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జాతిపిత గాంధీజీ ఆశయం మేరకు పరిశుభ్రతను కాపాడడం అందరి కర్తవ్యమని, ప్రతి ఒక్కరూ ఆ ప్రకారం అడుగు వేయాలని సంజీవరాయకోట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు శేషమ్మ పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తరగతి గదులు, పాఠశాల ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. వ్యాధులను నివారించాల్సిన బాధ్యత అందరిదీ అన్నారు. అనంతరం విద్యార్థులకు హరిత వ్యర్థాలు, పొడిచెత్తలు, విషపూరిత వ్యర్థాల గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా దిల్షాద్‌బేగం, చన్నమ్మ, సుమతి, వైశాలి, శ్వేత, ఉమ్మెహాని, గురుప్రసాద్, విజయ, విద్యార్థి ప్రతినిధి అనూష తదితరులు పాల్గొన్నారు.

చెరువుకు వాయనం సమర్పణ



వాయనం సమర్పిస్తున్న ఉజ్జిని సిద్ధలింగేశ్వరస్వాములు

కంప్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : విజయనగర జిల్లాలోని ఉజ్జిని వద్ద సిద్ధలింగ శివాచార్య స్వాములు చెరువుకు శనివారం వాయనం వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యేడాది రైతులకు అనుగుణంగా వర్షాలు కురుస్తున్నాయని, పుష్కలంగా రైతులు పంటలు పండించుకుంటారని తెలిపారు. గ్రామాల్లో ధార్మిక సాంస్కృతిక పద్ధతులను మరువరాదన్నారు. పిల్లలకు సంప్రదాయాలపై ఆసక్తి పెంచేలా తల్లిదండ్రులు పెంచాలన్నారు. నిత్యం ఇళ్లల్లో ఆరాధ్య దైవాన్ని పూజించాలన్నారు.

అద్దె చెల్లించని దుకాణాలకు తాళాలు



దుకాణాలకు తాళాలు వేస్తున్న అధికారులు

కంప్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని సిరిగేరి గ్రామంలో గ్రామ పంచాయతీ దుకాణాలు లీజుకు తీసుకుని కొన్ని సంవత్సరాలుగా అద్దె చెల్లించకపోవడంతో పీడీవో రామప్ప కొరడా ఝులిపించారు. శనివారం ఆయన నేతృత్వంలో గ్రామ పంచాయతీ సభ్యులు, సిబ్బందితో దుకాణాలకు తాళాలు వేశారు. ఈ సందర్భంగా రామప్ప మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో సుమారు 41 దుకాణాలున్నాయని, అందులో 11 దుకాణాల్లో సంవత్సరాలు గడుస్తున్నా అద్దె చెల్లించలేదన్నారు. రూ. 40 నుంచి రూ. 50 వేల వరకు బకాయిలు ఉండడంతో తాళాలు వేస్తున్నట్లు తెలిపారు. దుకాణదారులు సహకరిస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమన్నారు. అద్దె చెల్లించకపోతే ఎవరిపైనేనా చర్యలు తప్పవన్నారు.

కాంగ్రెస్ పార్టీది పోరాట చరిత్ర

తిరువళ్లువర్ ఎంపీ శశికాంత్ సెంథిల్



రాయచూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదని దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన చరిత్ర ఆ పార్టీ సొంతమని తమిళనాడు రాష్ట్రం తిరువళ్లవర్ ఎంపీ శశికాంత్ సెంథిల్ పేర్కొన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి అయిన శశికాంత్ సెంథిల్, శనివారం నగరంలోని రంగమందిరంలో ఈ-దిన డాట్ కాం పేరుతో ప్రజలతో ముఖా-ముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అయన బ్రిటీష్ సామ్రాజ్యవాదులతో పోరాటం సాగించిన అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో రూపుదిద్దిన భారత రాజ్యాంగం ద్వార పాలన జరగడం అందరి అదృష్టమన్నారు. ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో అన్ని వర్గాలను ఆదరించి సమసమాజంవైపు ప్రజలను నడిపించే శక్తి ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. విద్వేష రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీలో తావు లేదని ప్రస్తుతం అధికారంలో ఉన్న వారు రాజ్యాంగాన్నే మార్చివేసే ప్రయత్నం చేస్తుండడం ఆందోళనకరమన్నారు. అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు లభించడం ఒక్క అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే సాధ్యమని దాన్ని కాపాడుకునేందుకు ప్రతియొక్కరు తమ వంతు పాత్ర పోషించాలని కోరారు.

హోసూరు జోన్

జాగ్రత్తలతో రోడ్డు ప్రమాదాల నివారణ



ప్రసంగిస్తున్న పోలీసు అధికారి తంగదురై, చిత్రంలో కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి) అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సరైన జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని జిల్లా అధికారులు పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై విస్తృత సమావేశం నిర్వహించారు. హోసూరు నుంచి కృష్ణగిరి వరకు జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నందున బెంగళూరు, హోసూరు నుంచి సేలం, కోయంబత్తూరు వెళ్లే వాహనాలు, హోసూరు రాయకోట, పాలక్కాడ్ హైవే మీదుగా వెళ్లాలని జిల్లా కలెక్టర్ సరయు తెలిపారు. జిల్లా ఎస్పీ తంగదురై నేతృత్వంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహన చోదకులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలను పాటించి వాహనాలను నడపాలన్నారు. కారు డ్రైవర్లు తప్పనిసరిగా సీటు బెల్టులు ధరించి వాహనాలను నడపాలి, వాహనదారులందరూ వాహనం నడపడానికి తప్పనిసరి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు, ద్విచక్ర వాహనాలపై ఇద్దరి కంటే ఎక్కువ మంది కూర్చోరాదన్నారు. రాబోయే దీపావళి పండుగ సందర్భంగా ఈనెల 31 నుంచి నవంబరు 3వరకు నాలుగు రోజుల సెలవులు రావడంతో వాహన సంచారం అధికంగా ఉంటుందన్నారు. ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ప్రజలు సహకరించాలన్నారు. అలాగే టోల్ గేట్‌మీదుగా ఆర్టీసీ బస్సులు సజావుగా వెళ్లేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో రోడ్డు భద్రతా, శాంతి భద్రతలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ప్రజలు సహకరిస్తే ప్రమాదాలు నివారించడం అసాధ్యం కాదని, కుటుంబ సంక్షేమం దృష్ట్యా అందరూ నిబంధనలు పాటించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి సాధనకురళ్, జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ పుష్ప, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, కృష్ణగిరి రెవెన్యూ కమీషనర్ షాజఖాన్ పాల్గొన్నారు. రవాణాశాఖాధికారులు కాళియప్పన్, దురైస్వామి, డిప్యూటీ సూపరెంటెండెంట్లు ఆఫ్ పోలీస్, డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

రసాయన వ్యర్థాలపై రైతుల నిరసన

హోసూరు అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హోసూరు కెలవరపల్లి డ్యామ్ సమీపంలో నురుగునీటిలో ప్రమాదకరమైన రసాయన వ్యర్థాలు ఉండడంతో పంటలకు నష్టం వాటిల్లుతోందని రైతు సంఘం ఆక్రోశం వ్యక్తం చేసింది. దక్షిణ పినాకిని నదిలో వృథాగా ఉన్న నీటిని కర్ణాటక ప్రభుత్వం శుభ్రం చేయాలని డిమాండ్ చేస్తూ తమిళనాడు రైతు పరిరక్షణ సంఘం డిమాండ్ చేసింది. నిరసనకు జిల్లా కార్యదర్శి గణేశ్‌రెడ్డి అధ్యక్షత వహించారు. కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా హోసూరు కెలవరపల్లి డ్యామ్‌కు దక్షిణపినాకిని ద్వారా ఇన్‌ఫ్లో పెరిగింది. రెండు రోజులుగా రోజులుగా కెలవరపల్లి డ్యామ్‌కు 4160 క్యూసెక్కుల నీరు వచ్చింది. డ్యామ్ నుంచి అదే ప్రమాణంలో నీటిని విడుదల చేశారు. దక్షిణ పినాకిని నదిలో రసాయనిక నీటి నురుగు కారణంగా సమీపంలోని అండర్‌పాస్ మునిగి రాకపోకలకు అంతరాయం నెలకొన్న విషయం విదితమే. వర్షాకాలంలో రసాయనిక నురుగుతో తీవ్ర దుర్వాసన రావడం సర్వసాధారణంగా మారింది.



నిరసనలో పాల్గొన్న రైతుసంఘాల నాయకులు, రైతులు

దక్షిణ పినాకిని నదిలోకి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధి చేసిన నీటిని వదిలేలా కర్ణాటక ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతుసంఘం కోరింది. తమిళనాడు ప్రభుత్వం కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన

హోసూరు అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరు జూజూవాడి ప్రాంతంల్లో వందకు పైగా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. క్రాకర్స్ షాపు యజమానులకు ఉద్యోగులకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శనివారం బాణాసంచా ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రత్యేక అధికారి రాజా ఎవరైనా అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలి, అపస్మారక స్థితిలో ఉండే వారిని రక్షించడం, అపస్మారక స్థితిలో ఉంటే వారికి ప్రథమచికిత్స చేయడం మొదలైనవి వంటివి నేర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ రెండు రాష్ట్రాలను కలిపే రహదారి ఉండడంతో అత్యవసర పరిస్థితిల్లో అగ్నిమాపక వాహనాలు వచ్చి వెళ్లే సౌకర్యం ఉండాలని, దుకాణాన్ని గ్రౌండ్‌ఫ్లోర్‌లో మాత్రమే నిర్వహించాలని, బాణసంచా దుకాణాం ఉన్న ప్రదేశానికి 50 కిలోమీటర్ల ఆసుపత్రి, పాఠశాల, ప్రార్థనా స్థలం, కళ్యాణ మండపం, షాపింగ్ మాల్స్ థియేటర్లు, పరిశ్రమలు హైవే, రైల్వే, రిజర్వాయర్, భూగర్భ పైపులైన్లు, హైవోల్టేజీ లైన్లు, ప్రమాదకరమైన మండే పదార్థాలు ఉండరాదన్నారు. టీ షాప్‌లు, బస్టాప్‌లు, బస్సులు, షాపింగ్ వీధులు ఉండరాదన్నారు. బాణాసంచా దుకాణం ఉండే భవనం రెండు మార్గాలను కలిగి ఉండటం అవసరం, దుకాణం నుంచి తక్షణమే బయటకు వెళ్లేందుకు అత్యవసర ద్వారం ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.



బాణసంచా ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది